క్లుప్తంగా

ఎస్సారెస్పీని సందర్శించిన విమలక్క



బాల్కొండ: అరుణోదయ కళాకారిణి విమలక్క శనివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణ వివరాలను, వరదలు, నీటి విడుదలను గురించి ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌజ్‌లను పరిశీలించారు. ఆమె వెంట ప్రాజెక్ట్ వరద కాలువ డిప్యూటీఈఈ గణేష్, అరుణోదయ కళాబృందం తదితరులున్నారు.

ఆర్మూర్ సబ్ కలెక్టర్‌ను కలిసిన టీఆర్‌ఈఎస్‌ఏ బృందం



ఆర్మూర్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఆర్‌ఈఎస్‌ఏ) ఆర్మూర్ డివిజన్ అధికారులు, సిబ్బంది ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాను శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు పి.శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ డీ.భరత్, కోశాధికారి ఎం.అరవింద్, అసోసియేట్ అధ్యక్షుడు పి.విక్రమ్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

ముగిసిన సర్కిల్ క్రికెట్ టోర్నీ



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. టోర్నమెంట్‌లో గెంజ్ టీం ప్రథమ, జీకేఆర్‌ఎస్ ద్వితీయ, ఆర్‌జీవై టీం మూడవ బహుమతి పొందారు. విజేతలకు బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మొండి అశోక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ మదన్, శ్రీకాంత్, నరేశ్, డెని, సాయి, విఘ్నేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ



ఆర్మూర్: పట్టణంలోని మామిడిపల్లిలో గల తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలో అనాథ పిల్లల కోసం అమెరికాకు చెందిన శ్రీలత కోరాడ స్థాపించిన హెల్ప్ టూ అదర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఈ సరుకులను హెల్ప్ టూ అదర్స్ సంస్థ ఇండియా ప్రతినిధి జిలకర లావణ్య చేతుల మీదుగా తపస్వి సంరక్షకులు శ్రీనివాస్, కవితలకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సంరక్షులు మాట్లాడుతూ సుమారు రూ.25 వేల విలువైన సరుకులను అందజేసిన శ్రీలత కోరాడకు కృతజ్ఞతలు తెలిపారు. విజయానంద్, గుండు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్టు,స్కీం వర్కర్స్ కార్మికులుగా పని చేస్తున్న వారికి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ తో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్స్, అటెండర్లు ఈ నెల 6న కలెక్టరేట్ వద్దకు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నర్సయ్య, అంజన్న, సాయిలు, పోతన్న, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డంపింగ్‌యార్డ్

- రోడ్డు మీదికి వస్తున్న చెత్త
- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇబ్బందుల్లో వాహనదారులు
- చెడిపోయిన జేసీబీ.. నిలిచిన పనులు



కోటార్మూర్‌లో డంపింగ్ యార్డు నుంచి రోడ్డు పైకి చేరిన చెత్త

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటర్మూర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ పరిస్థితి రోజు రోజుకూ అధ్వానంగా మారుతోంది. మున్సిపల్ పరిధి 36 వార్డుల నుంచి శానిటేషన్ విభాగంలో చెత్తను సేకరించేందుకు 22 ట్రాలీ ఆటోలు, 9 ట్రాక్టర్లు ఒక జేసీబీ, ఒకబ్లేడ్ వాహనాలు ఉన్నాయి. గత నెలరోజుల నుంచి జేసీబీ పనిచేయడం లేదు. పట్టణంలోని 36 వార్డుల నుంచి ప్రతిరోజు సేకరిస్తున్న సుమారు 30మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. ప్రస్తుతం డంపింగ్ యార్డ్ పూర్తిగా నిండిపోయి చెత్త రోడ్డు మీదకే వస్తోంది. డంపింగ్ యార్డ్‌లోని చెత్తను జేసీబీ సహాయంతో లోనికి తరలించాల్సి ఉన్నా, జేసీబీ పనిచేయడంలేదు. అధికారులు నిర్లక్ష్యం వహించడంతో 63వ నెంబర్ జాతీయ రహదారిపై చెత్త గాలికి రోడ్డుమీదకి వస్తుండటంతో దుర్వాసనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సమీప ప్రదేశాల్లోని ప్రజలు దోమల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్‌యార్డు పరిస్థితి అధ్వానంగా తయారైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

డంపింగ్‌యార్డుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డు బోర్డు బయట వరకు చెత్త చేరడంతో పాటు రోడ్డుపై చెత్త వచ్చి చేరుతుంది. దీంతో అటు వైపు ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైనా అధికారులు చెత్తను రోడ్డుపైకి రాకుండా చూడాలి. – కలిగొట ప్రశాంత్, ఆర్మూర్

డంపింగ్‌యార్డు నిర్వహణ చేపట్టాలి

అధికారులు ప్రతిరోజు డంపింగ్ యార్డు నిర్వహణపై దృష్టిసారించాలి. చెత్త రోడ్డుపై చేరడంతో వాహనదారులకు దుర్గంధం, గాలికి చెత్త వాహనాలపైకి వస్తుంది. అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. – నరేష్, పెర్కిట్

గెలిచే అవకాశం ఉన్న వారికే 'టికెట్లు'

కమ్మర్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్నవారికే పార్టీ టికెట్లు కేటాయిస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీశుక్రవారం దేవీ ఆలయ ప్రాంగణంలో మండల కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బి. వేణుగోపాల్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి ఏలేటి గంగాధర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి పంపనున్నట్లు వెల్లడించారు. ముగ్గురిలో ఒకరికి మాత్రమే పార్టీ టికెట్ కేటాయిస్తుందన్నారు. టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలన్నారు. టికెట్ రాని వారు నిరుత్సాహ పడకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, పార్టీ జిల్లా కార్యదర్శి తక్కూరి దేవేందర్, నాయకులు నూకల బుచ్చిమల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సుంకెట శ్రీనివాస్, కొడ శైలేందర్, జైడి శ్రీనివాస్, డాక్టర్ మురళి, కొమ్ముల రవీందర్, రేవతి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకెట రవి

స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ముత్యాలమ్మ మందిరం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికతో పాటు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. టికెట్ రాని వారు బాధపడకుండా గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలకు తగిన గుర్తింపు

మాక్లూర్: గిరిజన జాతి అభివృద్ధికి పాటు పడుతున్న కుంచోత్ కిషన్‌నాయక్ సేవలను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకత్వం గుర్తించి ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమించటం అభినందనీయమని కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకుడు నీలగిరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన కుంచోత్ కిషన్‌నాయక్ బంజారా సేవాసంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడిగా నియామకమైన విషయం తెలిసిందే. ఈసందర్భంగా శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వగ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కిషన్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకులు సిరికొండ మహేష్, శివకృష్ణ, రాజు, కిట్టి, గంగాధర్, సురేష్‌గౌడ్, టింకూ, అర్జిత్ పాల్గొన్నారు.



కుంచోత్ కిషన్‌నాయక్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీజేపీలో చేరిక

నందిపేట్ (ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు బీజేపీలో చేరుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన మేకల శీను, మేకల చిన్నయ్య, నాగనాథ్, గద్దల గంగాధర్, వెల్మల్ దేవన్న, ఎర్రోళ్ల శేఖర్, వెల్మల్ గంగారం, శశికాంత్, లికీష్ చరణ్, సాయి చరణ్ తో పాటు 50 మంది బీజేపీ సీనియర్ నాయకులకు కంచెట్టి గంగాధర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పటేల్ రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగ సురేష్, బీజేపీ సీనియర్ నాయకులు పెంటరాజు, మండల ప్రధాన కార్యదర్శిలు కస్తూరి గంగాధర్, రవీందర్, వీరేశం, భూతం సాయి రెడ్డి, చిన్న రెడ్డి, చిన్నయ్య,రాజు మండల స్థాయి జిల్లాస్థాయి బూత్ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బీజేపీ కండువా కప్పుతున్న కంచెట్టి గంగాధర్

ప్రజావాణి రద్దు

నిజామాబాద్‌అర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున ఎన్నికల కోడ్ ముగిసేవరకు ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

నూత్‌పల్లి జాతరకు వేళాయే!

- రేపటి నుంచి రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లలో నిమగ్నమైన గ్రామస్తులు



నూత్‌పల్లిలోని శివాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లిలో ఐదు రోజుల పాటు జరిగే శ్రీ రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈగుడిలోని శివలింగాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ప్రతి ఏటా అక్టోబర్‌లో నిర్వహించే స్వామివారి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గుడికి రంగులు వేసి విద్యుత్ దీపాల అలంకరణ పనిలో ఉన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డుపై గుంతలను పూడ్చారు. పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. 6న స్వామి వారి ఊరేగింపు, కల్యాణం, 7న అమ్మవారి బోనాలు (సలనంబర్లు), 8న అన్నదానం, రథోత్సవం, 9న స్వామివారికి నైవేద్యాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 10న నాగవెల్లి, పల్లకీసేవ నిర్వహించనున్నారు.

జాతర ఎంతో ప్రత్యేకం



ఏడాదికోసారి జరిగే రాజరాజేశ్వర స్వామి జాతర ఎంతో ప్రత్యేకం. విశిష్టత కలిగిన శివలింగానికి నిత్యాభిషేకం, దూపదీప నైవేద్యాలు సమర్పిస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. రథోత్సవం వైభవంగా జరుగుతుంది.
– బాపయ్య, ఆలయ పూజారి

ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర



మోస్రా మండల కేంద్రంలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వర్ని/వేల్పూర్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్ : జిల్లాలోని పలు చోట్ల దుర్గామాత విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను శనివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం కోసం బాసరలో గోదావరి నదికి తరలించారు.



వర్నిలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు,చిన్నారులు



పడగల్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పడగల్ ఆరె క్షత్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు



ధర్మోరాలో నిమజ్జనానికి తరులుతున్న దుర్గామాత



ఆర్మూర్‌లో గోల్‌బంగ్లా వద్ద దాండియా ఆడుతున్న మహిళలు, చిన్నారులు

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణం

- ఏర్గట్ల మండలకేంద్రంలో పిచ్చిమొక్కల మధ్య..
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



పిచ్చిమొక్కల మధ్య ఉన్న ఏర్గట్ల క్రీడా ప్రాంగణం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. అక్కడ సరైన రక్షణ చర్యలు లేవు. క్రీడా సామగ్రి ఎక్కడ పెట్టాలో తెలియక ప్రాంగణాన్ని వృథాగా వదలివేశారు. క్రీడా ప్రాంగణం వినియోగంలో లేకపోవడంతో గడ్డి మొలచి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ప్రాంగణం కోసం రూ.75వేలు ఖర్చు చేశారు. ఒక్క ఏర్గట్ల క్రీడా ప్రాంగణం పరిస్థితే కాదు. జిల్లాలోని అనేక గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల దుస్థితి ఇలాగే ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో ఏర్పాటైన క్రీడా ప్రాంగణాలను పట్టించుకునేవారు లేక అవి అలంకార ప్రాయంగానే మారిపోయాయి. క్రీడా ప్రాంగణాలను ఎక్కువ చోట్ల గ్రామానికి దూరంగా ఉండటం, సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. 2022లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రాంగణాలను ఆరంభించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ నిధులతో ఒక్కో ప్రాంగణం కోసం రూ.75వేల వరకు ఖర్చు చేశారు. క్రీడా సామగ్రి కొనుగోలు కోసం మరో రూ.10వేలు ఖర్చు చేశారు. గ్రామాలలోని యువత క్రీడల్లో శిక్షణ పొందడం, వ్యాయామం కోసం ఈ ప్రాంగణాలను వినియోగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. క్రీడా ప్రాంగణాల స్థల సేకరణలో ఎదురైన ఇబ్బందులతో ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఈ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.

యువతకు అందుబాటులోకి తీసుకురావాలి



క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. యువత కోసం ఈ ప్రాంగణాలు ఎంతో మేలు చేసేవిగా ఉన్నాయి. గ్రామ పంచాయతీలు స్పందించి క్రీడా ప్రాంగణాలను ఆధునీకరించాలి. సరైన వసతులు కల్పించి, సామగ్రిని అందుబాటులో ఉంచాలి. – వినీత్‌కుమార్ గౌడ్, మోర్తాడ్

ప్రభుత్వానికి విన్నవిస్తాం



క్రీడా ప్రాంగణాలను వినియోగించే విషయంలో ప్రభుత్వానికి విన్నవిస్తాం. ప్రతి యువతి, యువకులు ఈ ప్రాంగణాలను వినియోగించుకుని పోలీసు, ఇతరత్రా యూనిఫాం ఉద్యోగాలను దక్కించుకోవాలి. ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించి ప్రాంగణాలను ముస్తాబు చేయిస్తాం.
– జక్కం అశోక్, కాంగ్రెస్ నాయకుడు, మోర్తాడ్

నష్టపరిహారం చెల్లించాలి



కోస్లీలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నవీపేట: గోదావరి వరద ఉధృతిలో నష్టపోయిన తీర ప్రాంత రైతులను ఆదుకోవాలని జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు డిమాండ్ చేశారు. గోదావరి వరద ఉధృతికి నష్టపోయిన కోస్లీ, మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ శివారులోని పంట భూములను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావ్ మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను దిగువ ప్రాంతానికి పంపించేందుకు గేటు తెరవకుండా ఖమ్మం జిల్లా మంత్రులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఆ ప్రాంత రైతుల భూములు ముంపునకు గురవుతాయని పక్షపాత వైఖరి వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావ్, న్యాలకంటి అబ్బన్న, లోకం నర్సయ్య, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు ప్రారంభం



డిచ్‌పల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన బెటాలియన్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరాధన, గరుడ ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశము, హోమ కుంభస్థాపన, వాస్తు స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ హోమం, వాస్తు హోమం, గరుడ తత్వ హోమం, ప్రాణ ప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. టీజీఎస్పీ ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కమాండెంట్ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పల్లకీలో యాగశాలకు మోసుకువచ్చారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ..



డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్ గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పోచమ్మ బోనాలు, సోమవారం పుట్ట వద్ద దని పోయుట, మంగళవారం బోనాలు ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ దశగౌడ్ తెలిపారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో వీజీగౌడ్ ను సన్మానించారు.